సాక్షి అనకాపల్లి

గురువారం । 30 । మార్చి । 2023



గోవాకు విమాన సర్వీస్

విశాఖ: ఇండిగో సంస్థ గోవాకు విమాన సర్వీస్ ప్రారంభించింది. మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు అందుబాటులో ఉంటుంది.



అథ్లెటిక్ చాంపియన్ ఏఎంసీ

విశాఖ: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సైన్సెస్ అంతర కళాశాలల అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌ను ఆంధ్ర మెడికల్ కాలేజీ సాధించింది.



టైంపాస్ చేయకండి

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖాధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

10లో

రంజాన్ వేళలు

అనకాపల్లి

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
అనకాపల్లి	6-13	4-39
నర్సీపట్నం	6-17	4-38

న్యూస్‌రీల్


దేవదాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి బాధ్యతల స్వీకారం



రాజారావు

అనకాపల్లి టౌన్: దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారిగా ఎస్.రాజారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత జిల్లా అధికారి బుద్ద మహాలక్ష్మినగేష్‌ను విశాఖ సత్యనారాయణ స్వామి ఆలయానికి ఈవోగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఎండోమెంట్ శాఖ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజారావును ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా నియమించారు.

అందుబాటులో పూర్తి స్థాయి వైద్య సేవలు



గవరపాలెం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

తుమ్మపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా కదలలేని స్థితిలో ఉన్న రోగులు సైతం వైద్య సేవలు పొందవచ్చని డీఎంహెచ్‌వో హేమంత్ అన్నారు. అనకాపల్లి పట్టణంలో గవరపాలెం పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో స్టోర్‌రూమ్, లేబర్‌రూమ్, ఆపరేషన్ థియేటర్, వార్డు రూమ్, అక్కడ గల సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో పూర్తి స్థాయి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన పనిలేదన్నారు.

నేడు, రేపు సౌకర్యం కేంద్రాలు పనిచేస్తాయి

విశాఖ: జీవీఎంసీ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించేందుకు అనువుగా గురు, శుక్రవారాల్లో అన్ని సౌకర్యం కేంద్రాలు తెరిచే ఉంటాయని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ పన్నులు చెల్లించేందుకు అన్ని జోన్లలోని సౌకర్యం కేంద్రాలు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీ మినహాయింపు ప్రకటించిన నేపథ్యంలో నగర వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆస్తిపన్ను వడ్డీ రాయితీతో చెల్లించేందుకు ఈ నెల 31తో గడువు ముగుస్తుందని.. ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ సంస్థలు ఆస్తి పన్నును చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు.

ప్రపంచ దిగ్గజ డ్రెడ్జింగ్ సంస్థగా డీసీఐఎల్



డీసీఐఎల్ ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎండీ అండ్ సీఈవో కెప్టెన్ దివాకర్

దొండపర్తి(విశాఖ దక్షిణ): రానున్న కాలంలో డ్రెడ్జింగ్ కార్యకలాపాల్లో ప్రపంచ దిగ్గజ సంస్థగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐఎల్) ఆవిర్భవించే దిశగా అడుగులు వేస్తోందని సంస్థ ఎండీ అండ్ సీఈవో కెప్టెన్ ఎస్.దివాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డీసీఐఎల్ 47వ ఆవిర్భావ దిన వేడుకలను బుధవారం సీతమ్మధారలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ ప్రగతిని వివరించారు. నాలుగు దశాబ్దాలుగా సంస్థ ఉద్యోగులు, అధికారుల కృషి ఫలితంగా డీసీఐఎల్ ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక టర్నోవర్‌ను నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం సంస్థ ఉద్యోగులు, వారి పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఐఎల్ డైరెక్టర్లు, పలు విభాగాల అధిపతులు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

• రాములోరి పెళ్లికి ఊరంతా సందడి





పెళ్లంటేనే సందడి, కోలాహలం.. అందులో సీతారాముల కల్యాణమంటే ఆ వేడుకకు, వైభోగానికి హద్దు ఉంటుందా.. దేవుడి పెళ్లికి ఊరంతా పెద్దలే. అందుకు రావికమతం మండలం కొత్తకోటలోని ఈ చిత్రాలే తార్కాణం. గురువారం శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే దేవుడి పెళ్లి కోసం ఒకపక్క చలువ పందిళ్లు వేస్తూ.. మరోపక్క పూల దండలు కడుతూ భక్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు, పిల్లలు సొంతింట్లో కార్యక్రమంలా ఆయా కార్యక్రమాలలో పాల్గొని సహాయ సహకారాలందిస్తున్నారు. కొత్తకోట, రావికమతం, మరుపాక తదితర గ్రామాలలో పెండ్లిరాట కార్యక్రమం వేడుకగా జరిగింది. -రావికమతం

జగదభిరాముడికి గుమ్మడి గింజల హారం

మాకవరపాలెం: శ్రీరామనవమి సందర్భంగా తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ బూడిద గుమ్మడి గింజలతో హారం రూపొందించాడు. రాముల వారి కోసం 234 గుమ్మడి గింజలతో ఈ హారం తయారు చేసినట్టు రవికుమార్ తెలిపాడు. పది గింజలపై రామ రామ రామ అని రాశాడు.



అప్పన్న కల్యాణోత్సవానికి కానుకగా పట్టువస్త్రాలు



ప్రధాన అర్చకుడికి పట్టువస్త్రాల సమర్పణ

సింహాచలం: సింహగిరిపై వచ్చేనెల 2న జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చెన్నైకి చెందిన వెంకటరమణ 1.70 లక్షలు, డి.అప్పారావు 1.41 లక్షలు, ఎస్.కె.మూర్తి 1.40 లక్షల విలువ చేసే పట్టువస్త్రాలను కానుకగా అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో నరసింహరాజు, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావుకి వీటిని అందజేశారు. అలాగే నగరంలోని గోపాలపట్నానికి చెందిన స్వర్ణ జ్యూయలర్స్ ప్రతినిధులు కేజీ ముత్యాల తలంబ్రాలను కానుకగా అందించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకి వీటిని అందజేశారు.

యోగ, ధ్యానం.. ఆరోగ్యభాగ్యం

ఒకే భూమి.. ఒకే కుటుంబం.. ఒకే భవిత.. అనే నినాదంతో జీ- 20 పగ్గాల్ని చేపట్టిన భారతావని ప్రతిష్టను ఇనుమడింపజేసేలా విశాఖలో రెండో రోజు సదస్సు విజయవంతంగా జరిగింది. బుధవారం ఉదయం ఆరోగ్య సంరక్షణతో మొదలై.. మౌలిక సదుపాయాల కల్పన చర్చతో సదస్సు ముగిసింది. సాగర తీరంలో విదేశీ ప్రతినిధులు యోగాసనాలు వేశారు. మెడిటేషన్ చేశారు. అనంతరం మౌలిక సదుపాయాల కల్పనపై జీ–20 దేశాల ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు.



మౌలిక సదుపాయాల కల్పనపై జరిగిన చర్చలో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

- రెండో రోజు కొనసాగిన జీ–20 సదస్సు
- సాగరతీరంలో విదేశీ ప్రతినిధుల యోగాసనాలు
- మౌలిక సదుపాయాల కల్పనపై విస్తృత చర్చలు
- నేడు సందర్శన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన

సాక్షి, విశాఖపట్నం : జీ–20 సదస్సు రెండో రోజులో భాగంగా మొదటి సెషన్ సూర్యోదయం సమయంలోనే ప్రారంభమైంది. మెదడు, శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకునేందుకు ప్రతి రోజూ యోగా, ధ్యానం ప్రతి ఒక్కరికీ అవసరమని చాటి చెప్పేందుకు విదేశీ ప్రతినిధులు యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలోని సాగరతీరంలో నిపుణుల పర్యవేక్షణలో విదేశీ ప్రతినిధులు యోగా చేశారు. అనంతరం మెడిటేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా పౌష్టికాహార వినియోగం వల్ల ఆరోగ్యానికి ఒనగూరే ప్రయోజనాలను వారికి నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో 14 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. అల్పాహారం అనంతరం మౌలిక సదుపాయాల కల్పన అనే అంశంపై ప్రధాన సమావేశం ప్రారంభమైంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌ల భవిష్యత్‌పై ప్రతినిధులు చర్చించారు. మౌలిక సదుపాయాల కల్పనలో నగరాలను ప్రోత్సహిస్తూ.. వారిని భాగస్వాములు చేయడం, పెట్టుబడులు వచ్చే మార్గాలను మెరుగుపరచడం మొదలైన అంశాలపై దృష్టి సారిస్తూ సుదీర్ఘ చర్చలు జరిగాయి. చివరి సెషన్‌లో అర్బన్ అడ్మినిస్ట్రేషన్‌లో ఫ్రేమ్‌వర్క్‌ను ఎలా అభివృద్ధి చేయాలి, ఇన్‌ఫ్రాట్రాకర్ 2.0ని మెరుగుపరిచే అంశాలపై టెక్నికల్ సెషన్స్ కూడా నిర్వహించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్(ఐడబ్ల్యూజీ)కి ఆస్ట్రేలియా, బ్రెజిల్ దేశాల ప్రతినిధులు సహ అధ్యక్షులుగా వ్యవహరించి సదస్సును నడిపించారు.



యోగాసనాలు వేస్తున్న విదేశీ ప్రతినిధులు

నేడు క్షేత్రస్థాయి పరిశీలన

సదస్సులో మూడో రోజైన గురువారం ఉదయం 10 గంటల నుంచి 1.30 వరకు కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. అనంతరం జీ–20 దేశాల ప్రతినిధుల క్షేత్ర స్థాయి పర్యటనలు ఉంటాయి. ఇందులో భాగంగా ముడసర్లోవ, కాపులుప్పాడ ప్రాంతాల్లో విదేశీయుల పర్యటించనున్నారు. స్మార్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్, మెగా ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, జిందాల్ నిర్వహిస్తున్న వేస్ట్ టు ఎనర్జీ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లను సందర్శించనున్నారు. అనంతరం పలు సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.



యోగ, మెడిటేషన్ సెషన్ అనంతరం ఫొటో దిగిన 14 దేశాల ప్రతినిధులు

చకచకా పంటనష్టం అంచనా

- జిల్లాలో 944 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు ప్రాథమిక సమాచారం
- నేటితో వివరాల సేకరణ పూర్తి



అనకాపల్లి ఆవఖండంలో దెబ్బతిన్న టమాటా పంటను పరిశీలిస్తున్న ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు

తుమ్మపాల: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలు ధ్వంసమై పలుచోట్ల రైతులు నష్టపోయారు. టమాటా, కూరగాయల పంటలు అధికంగా దెబ్బతిన్నాయి. పలు ఉద్యాన పంటలతో పాటు, మొక్కజొన్న, నువ్వుల సాగుపై ఎక్కువ ప్రభావం పడింది. రైతులకు కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ మొదలు పెట్టి చకచకా వివరాలు సేకరిస్తోంది. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు రెవెన్యూ శాఖ వారితో కలిసి గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. గురువారంతో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. సేకరించిన పంట నష్టం వివరాలను ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది జాబితాను కలెక్టర్‌కు నివేదిస్తారు.

పంటనష్టం 33 శాతం దాటితేనే..

జిల్లాలో వివిధ పంటలకు సంబంధించి 902 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అయితే ఈ సంఖ్య క్షేత్రస్థాయి పరిశీలనలో 944 ఎకరాలకు పెరిగింది. రైతు పండించే పంటలో 33 శాతం గానీ, అంత కన్నా ఎక్కువ గానీ నష్టం జరిగితే మాత్రమే వివరాలు నమోదు చేస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుంటున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం మాడుగుల, మాకవరపాలెం, మునగపాక, అనకాపల్లి మండలాల్లో 386 ఎకరాలు, రోలుగుంట, అనకాపల్లి, మునగపాక, యలమంచిలి, అచ్యుతాపురం, దేవరాపల్లి మండలాల్లో 558 ఎకరాలు దెబ్బతిన్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి

నువ్వులు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు ప్రధానంగా దెబ్బతిన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు చెప్పారు. పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించి కాయ పక్వదశలో ఉన్న పంటలకు 19.19.19 పదార్థాన్ని 5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. మొక్కలకు యూరియా కూడా వేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నష్టపరిహారం వివరాలు నమోదు చేస్తున్నామని, గురువారంతో పంట నష్టం వివరాల సేకరణ పూర్తవుతుందని ఉద్యానశాఖ జిల్లా అధికారి ప్రభాకరరావు తెలిపారు. రైతులు తమ గ్రామాల్లో ఉద్యాన, వ్యవసాయ సిబ్బందిని కలిసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

అధికార భాషపై ప్రత్యేక దృష్టి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): డివిజనల్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో అధికార భాషా సమావేశం నిర్వహించారు. గత త్రైమాసికంలో కమిటీ చేపట్టిన వివిధ ప్రధాన పనుల నిమిత్తం చర్చించారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్ ప్రచురిస్తున్న విశాఖ వాణి హిందీ మ్యాగజైన్‌ను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విభాగంలోని అధికారులు అధికారిక భాషా విధానంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయా విభాగాల్లో హిందీ భాషపై పనిచేయడంలో, టైప్‌లో శిక్షణ పొందిన ఉద్యోగులు తప్పకుండా వాటిని ఆచరణలో పెట్టాలన్నారు. మరింత మంది ఉద్యోగులను హిందీ పోటీలు, వర్క్‌షాప్‌ల్లో పాల్గొనేలా ప్రేరేపించాలని చెప్పారు. విశాఖ వాణి పత్రికలో ఆర్టికల్స్ రాసిన ఉద్యోగులు, అధికారులను డీఆర్ఎం అభినందించారు.

అత్యంత సుందర నగరం విశాఖ

- కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు
- ఘనంగా ఐఐఎం 7వ స్నాతకోత్సవం
- విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీల ప్రదానం



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు



విద్యార్థికి బంగారు పతకం, డిగ్రీ ప్రదానం చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు

ఏయూక్యాంపస్: అత్యంత సుందర నగరాల్లో ఒకటిగా విశాఖ నిలుస్తుందని కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. ఇటువంటి నగరంలో ఉండి పనిచేసే అద్భుత అవకాశం తనకు రాలేదని చెప్పారు. బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో బుధవారం ఐఐఎం విశాఖపట్నం 7వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విశాఖ లాంటి బ్యూటిఫుల్ సిటీలో ఉన్న ఐఐఎంలో చదువుకోవడం మీ అందరికీ లభించిన మంచి అవకాశమన్నారు. తనకు ఐఐఎంలో చదువుకునే అవకాశం రాలేదని, అతిథిగా మాత్రమే వెళ్లగలిగానని గుర్తుచేసుకున్నారు. ఇక్కడ గోల్డ్ మెడల్స్ సాధించిన ప్రతి విద్యార్థికి కేవలం పూతపూసినవి ఇవ్వలేదని, స్వచ్ఛమైన మేలిమి బంగారంతో తయారు చేసి అందించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులంతా మేలిమి బంగారం మెరిసినట్లు.. ఎంచుకున్న రంగంలో అద్వితీయ ప్రగతి, పరిణితి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు బంగారు పతకాలు, డిగ్రీలను సురేష్ ప్రభు ప్రదానం చేశారు. 2020–2022 బ్యాచ్‌కు చెందిన మొత్తం 239 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొందారు.

గోల్డ్ మెడల్ విజేతలు వీరే..

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం(పీజీపీ) విభాగంలో ఆయాన్ వర్మ, ప్రాప్తి ఆలోక్.. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఫర్ ఎక్స్‌పీరియన్స్‌డ్ ప్రొఫెషనల్స్(పీజీపీఎక్స్) విభాగంలో కునాల్ రంజన్, తన్మయ గుప్త.. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం డిజిటల్ గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్(పీజీపీడీజీఎం) విభాగంలో మిన్హాజ్ అహ్మద్, ఆశిం చాబ్లాలు బంగారు పతకాలను సాధించారు. వీరిలో ఆయాన్‌వర్మ, ప్రాప్తి ఆలోక్‌లు రెండేసి గోల్డ్ మెడల్స్ పొందారు.



తల్లిదండ్రులతో ఆనందం పంచుకుంటున్న గోల్డ్ మెడల్ విజేత

కళ్ల ముందే ఘోరం

- పండంటి కుటుంబంలో తీవ్ర విషాదం
- ఆగి ఉన్న లారీని కారు ఢీకొని తల్లీ కొడుకు మృతి
- పరామర్శకు వెళ్లి వస్తుండగా దుర్ఘటన

నిశి రాత్రి వేళ జరిగిన ఘోర ప్రమాదం ఆ కుటుంబంలో చీకటి నింపింది. బంధువులను పరామర్శించేందుకు వెళ్లి వస్తుండగా ప్రమాదం రూపంలో విధి కాటేసింది. కళ్ల ముందే భార్య, కొడుకును పోగొట్టుకున్న శ్రీనివాసరావు విషాదానికి అంతే లేదు. 'డాడీ.. మమ్మీకి ఏమైంది? సీట్లోనే అలా ఉండిపోయింది.. కిందకు దిగమనండి.. అన్నయ్యను రోడ్డు మీద పడుకోబెట్టేశారు.. ముఖం నిండా రక్తం వచ్చేస్తోంది.. నాకు భయంగా ఉంది డాడీ.. చేయి నొప్పి పెడుతోంది.. తట్టుకోలేక పోతున్నాను' అంటూ రోదిస్తున్న ఏడేళ్ల కుమార్తెను ఓదార్చలేక ఆయన కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కలిచివేసింది.



పిల్లలతో శ్రీనివాసరావు దంపతులు (ఫైల్)

నక్కపల్లి / పాయకరావుపేట : జాతీయ రహదారిపై పాయకరావుపేట మండలం సీతారామపురం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకు దుర్మరణం పాలయ్యారు. మరో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటనతో విశాఖపట్నం జిల్లాలోని మల్కాపురం ప్రాంతానికి చెందిన డాక్‌యార్డ్ ఉద్యోగి కోలా శ్రీనివాసరావు కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. తమ సమీప బంధువు మరణించడంతో దశ దిన కార్యక్రమానికి కోనసీమ జిల్లా గన్నవరం వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సీతారామపురం వద్ద పెట్రోలు బంకు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. కారును శ్రీనివాసరావు నడుపుతున్నారు. ముందు సీట్లో కూర్చున్న శ్రీనివాసరావు భార్య కోలా భారతి (44), వెనుక సీట్లో కూర్చున్న అతని కుమారుడు మోహన్ బాలాజీ (19) తీవ్ర గాయాలపాలై మరణించారు. భారతి గుండెకు, తలకు తీవ్ర గాయాలవడంతో కారులోనే ప్రాణాలు కోల్పోయింది. మోహన్ బాలాజీ తలకు, కంటికి తీవ్ర గాయాలవడంతో 108 వాహనంలో తుని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. శ్రీనివాసరావుతోపాటు తల్లి వరలక్ష్మి, చెల్లెలు కోలనాటి ధనలక్ష్మి, కుమార్తె హేమ స్ఫూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని తుని ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం గాజువాకలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాలకు నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారని ఎస్ఐ జోగారావు తెలిపారు.



తీవ్ర విషాదంలో శ్రీనివాసరావు



ప్రమాద స్థలిలో తుక్కుతుక్కయిన కారు

నిద్రమత్తు వల్లే ప్రమాదమా..?

అర్ధరాత్రి కావడంతో నిద్రమత్తులో రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని గమనించకుండా వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. ప్రమాదాన్ని స్థానికులు గుర్తించి వెంటనే 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో కారులో ఇరుక్కున్న వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.



ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న చిన్నారి స్ఫూర్తి

క్లుప్తంగా

నేడు మంత్రి మేరుగ నాగార్జున పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున గురువారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. హోటల్ దసపల్లాలో బస చేస్తున్న మంత్రి ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం కొక్కిరాపల్లికి వెళ్లి.. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సందర్శిస్తారు. అనంతరం నక్కపల్లిలో ఎస్సీ కార్పొరేషన్ భూమి తనిఖీ చేస్తారు. అక్కడ నుంచి తిరిగి దసపల్లాకు చేరుకుని బస చేస్తారు. 31న ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని అక్కడ నుంచి ఆనందపురం మండలం వెళతారు. అక్కడ పౌల్ట్రీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తారు. అక్కడ నుంచి దేవరాపల్లి వెళతారు. ఆనందపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేసి అక్కడ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారు. దేవరాపల్లి నుంచి కొత్తవలస బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు కొత్తవలస షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి పరిశీలిస్తారు. అనంతరం శ్రీకృష్ణాపురంలో ఎస్సీ కార్పొరేషన్ భూమిని పరిశీలిస్తారు. రాత్రికి గరీబ్‌రథ్ రైలులో మంత్రి గుంటూరు వెళతారు.

మహిళల అభివృద్ధే సీఎం ధ్యేయం

- బహిరంగ సభలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



చోడవరం సభలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సభకు హాజరైన వేలాది మంది డ్వాక్రా మహిళలు

చోడవరం: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను బుధవారం అందజేశారు. ఇక్కడ శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేలాది మంది డ్వాక్రా మహిళలు హాజరయ్యారు. చోడవరం మండలంలో 2257 డ్వాక్రా సంఘాల్లో 23 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ. 14 కోట్ల 57 లక్షలు మంజూరైంది. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు దశలవారీ రుణమాఫీ చేస్తూ ఆసరా పథకంలో లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. మరో పక్క సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చి ఆ వడ్డీని కూడా ప్రభుత్వమే భరించే విధంగా సహకారం అందిస్తున్నారన్నారు. ఆసరా పథకంలో మంజూరైన వడ్డీ డబ్బులు నేరుగా డ్వాక్రా సంఘాల ఖాతాల్లో జమ చేసి మహిళలకు అండగా ముఖ్యమంత్రి నిలిచారన్నారు. గతంలో చంద్రబాబు పసుపు కుంకుమ పేరుతో మహిళలను మభ్యపెట్టారని, మాఫీ చేస్తామని డ్వాక్రా మహిళలను మోసం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్ని విధాలుగా మహిళలకు అండగా నిలిచారన్నారు. ఇది ప్రచారాల ప్రభుత్వం కాదని, ఇది ప్రజా ప్రభుత్వమని ఆయన అన్నారు. మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మహిళలంతా మద్దతు పలకాలని ధర్మశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంపీపీ గాడి కాసు అప్పారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, యూత్ ప్రతినిధులు గూనూరు రాజు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

• ఆత్మీయ పలకరింపు



వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం బుధవారం చీడికాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా పరిశీలించారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. - చీడికాడ

గంజాయి తరలింపుపై గట్టి నిఘా

- నిందితులకు కఠిన శిక్షలు అమలు
- ఎస్పీ గౌతమి సాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

కె.కోటపాడు: జిల్లాలో గంజాయి తరలింపుపై గట్టి నిఘా పెట్టినట్లుఎస్పీ గౌతమి సాలి అన్నారు. మండలంలో గల ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులతో పాటు కేసుల్లో పట్టుబడిన సామగ్రిని భద్రపరిచే ఈ–మక్కాన్ గదిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతు గంజాయి తరలించే వ్యక్తులను గుర్తించి వారి కదలికలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ కేసుల్లో పట్టుబడిన వారికి కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. మొదటి విడతగా 37 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న చోట్ల రెవెన్యూ సిబ్బందితో వాహనదారులు జాగ్రత్తలు పాటించేటట్లు చర్యలు తీసుకున్నట్లు ఆమె వివరించారు. గతంలో కంటే రోడ్డు ప్రమాదాల్లో చనిపోయే వారి శాతం జిల్లాలో తగ్గిందని అన్నారు. గ్రామాల్లో పోలీస్ శాఖ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ గౌతమి సాలి తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు పచ్చదనంతో నిండి ఉండడంతో సిబ్బందిని ఆమె అభినందిచారు. కార్యక్రమంలో ఎస్ఐ బి. రామకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో పాలనలో విప్లవాత్మక మార్పులు

వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేకల హనుమంతు



పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేకల హనుమంతును సత్కరిస్తున్న ఎంపీపీలు సూరిబాబు, గోవింద్

అనకాపల్లి రూరల్: సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేకల హనుమంతు అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ వలన ప్రజలందరికీ సుమారు 520కి పైగా సేవలు గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి వచ్చాయని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయానికొచ్చిన ఆయన వివిధ పథకాల అమలు తీరు గురించి ఎంపీపీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో చర్చించారు. ఎన్నో సంస్కరణలతో సీఎం జగన్ పంచాయతీరాజ్ విభాగాన్ని పటిష్టపరిచారని, మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన అవసరం, బాధ్యత అందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. అంతకు ముందు రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మేకల హనుమంతును అనకాపల్లి, యలమంచిలి ఎంపీపీలు గొర్లి సూరిబాబు, బోదెపు గోవింద్, పార్టీ నేతలు సత్కరించారు. తర్వాత మేకల హనుమంతు జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, మూడు జిల్లాల పంచాయతీరాజ్ విభాగం ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించబడిన యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్‌లను మేకల హనుమంతు దుశ్శాలువ, పుష్ప గుచ్ఛాలతో సత్కరించారు. రానున్న సాధారణ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఇప్పట్నుంచే కృషి చేయాలని ఆయన కోరారు. మరోసారి వైఎస్ జగన్‌ను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేయాలని, ఇప్పటి సంస్కరణల ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతాయని నేతలు అభిప్రాయపడ్డారు. జిల్లాకు చెందిన పలువురు ఎంపీపీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగి దంపతుల కథ విషాదాంతం

- రాజుపాలెం సమీపంలో మృతదేహాలు లభ్యం
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు



రాజుపాలెం రైల్వే గేటు సమీపంలో వరప్రసాద్, మీరా మృతదేహాలు

కూర్మన్నపాలెం/అనకాపల్లిటౌన్: మేము వెళ్లిపోతున్నాం అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని అదృశ్యమైన ఉక్కు ఉద్యోగి చిత్రాడ వరప్రసాద్, అతని భార్య మీరా మృతదేహాలు బుధవారం లభ్యమయ్యాయి. అనకాపల్లి కొప్పాక వద్ద ఉన్న ఏలేరు కాలువ ఒడ్డున వరప్రసాద్, మీరా బైక్, చెప్పులు, బ్యాగు లభించిన చోటుకు రెండు కిలోమీటర్ల దూరంలోని రాజుపాలెం రైల్వేగేటు సమీపంలోని కాలువలో మృతదేహాలు లభ్యమయ్యాయి. గాజువాకలోని వడ్లపూడి తిరుమలనగర్‌కు చెందిన ఉక్కు ఉద్యోగి చిత్రాడ వరప్రసాద్(47) ఉక్కు కర్మాగారంలోని ఎస్ఎంఎస్ – 2 విభాగంలో పనిచేసేవారు. అతనికి 41 ఏళ్ల భార్య మీరా, కుమారుడు కృష్ణసాయితేజ(19), కుమార్తె దివ్యలక్ష్మి (23) ఉన్నారు. కుమార్తె దివ్యలక్ష్మికి గతేడాది వివాహం జరిపారు. కుమారుడు కృష్ణసాయితేజ బ్యాటరీ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక సమస్యలు ఎక్కువై అప్పులు తీర్చలేక తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసుకున్నారు. సెల్ఫీ వీడియో బయటకు రావడంతో వారి కుమారుడు కృష్ణసాయితేజ దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తండ్రి వరప్రాద్ ఫోన్ లొకేషన్ ఆధారంగా వెతగ్గా అనకాపల్లి జిల్లా కొప్పాక ఏలేరు కాలువ దగ్గర వరప్రసాద్ ఫోన్, చెప్పులు, హ్యాండ్ బ్యాగు గుర్తించారు. దువ్వాడ ఎస్ఐ కె.దేముడునాయుడు సమాచారంతో అనకాపల్లి గ్రామీణ ఎస్ఐ నరసింగరావు ఐదుగురు గజఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలకు ఎన్టీఆర్ వైద్యాలయంలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోదనలతో మిన్నంటిన తిరుమలనగర్

సెల్ఫీ వీడియో తీసి అదృశ్యమైన దంపతుల మృతదేహాలు లభ్యం కావడంతో తిరుమలనగర్‌లో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేకే తమ తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారని కుమార్తె దివ్యలక్ష్మి వాపోయారు. నిత్యం ఇంటికి వచ్చి దుర్భాషలాడడం, రోడ్డు మీదే పరువు తీస్తామంటూ అసభ్య పదజాలంతో దూషించడంతో తట్టుకోలేకే వారు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ సేవలు



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ విభాగాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

పాయకరావుపేట: అర్హులందరూ ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎయిమ్స్ ఎండీ (న్యూఢిల్లీ) డాక్టర్ ఏవీవీ రామలింగారెడ్డి అన్నారు. పట్టణంలో గల హైమా నేత్రాలయంలో ఆయన బుధవారం వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కంటి వైద్య సేవలను ప్రారంభించారు. అనంతరం కంటి వైద్య సేవలపై నేత్రాలయ వైద్యుడు పి.ప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో పాటు, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, వర్కింగ్ జర్నలిస్ట్స్ హెల్త్ స్కీం, ఆయుష్మాన్ భారత్ వంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య నిపుణులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి జీవీ రమణకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రధాన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు మొదటి, రెండో సంవత్సరం వారికి మరో రెండు పేపర్లు మిగిలి ఉన్నాయి. అయితే వీటికి ఒకేషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు మాత్రమే హాజరవుతారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ పరీక్షల కోసం 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.ఉమారాణి తెలిపారు.



వాడివేడిగా మున్సిపల్ సమావేశం



వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాదులాట జరిగింది. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల అరుపులు, కేకలతో సమావేశం మార్మోగింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులకు రోడ్డు విస్తరిస్తున్నట్లు ఎజెండాల్లో పేర్కొన్నారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి కల్పించుకుని రోడ్డు విస్తరణకు టీడీపీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ప్రకటించడంతో, అధికారపక్ష కౌన్సిలర్లు బల్లలు తరుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. వెంటనే పద్మావతి మాట్లాడుతూ రోడ్డు విస్తరణ బాధితులకు ప్రభుత్వం ఇచ్చే టీడీఆర్ బాండ్లతో ప్రయోజనం లేదని, నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించాలన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, మాకిరెడ్డి బుల్లిదొర, బయపురెడ్డి చినబాబు, సిరసపల్లి నాని, బోడపాటి సుబ్బలక్ష్మి, జగదీశ్వరి కల్పించుకుని ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. దీంతో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. టీడీపీ హయాంలో టీడీఆర్ బాండ్లు ఇవ్వలేదా అని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు. దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానాన్ని నర్సీపట్నంలో అమలు చేస్తున్నారు తప్ప కొత్తగా తీసుకురాలేదన్నారు. కమిషనర్ సమాధానం ఇవ్వాలని టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. కమిషనర్ కనకారావు మాట్లాడుతూ 2014 మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగులు పేర్కొన్నారని దాని ప్రకారమే రోడ్డు విస్తరణ జరుగుతుందని వివరణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం జీవో నెంబరు 180ను అనుసరించి రోడ్డు విస్తరణ బాధితులకు టీడీఆర్ బాండ్లు తప్ప ప్రభుత్వం నగదు రూపంలో నష్టపరిహారం చెల్లించటం లేదని, దేశవ్యాప్తంగా ఇదే విధానం ఉందని కౌన్సిల్‌కు వివరించారు. ఇదే సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి జోక్యం చేసుకుంటూ అసలు మున్సిపాలిటీలో ఏం జరుగుతుందో తనకు తెలియటం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎజెండా సైతం ముందు రోజే ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు జోక్యం చేసుకుని రోడ్డు విస్తరణపై భవన యజమానులు, బాధితులతో చర్చించి నిర్ణయం తీసుకోవటం వల్ల ఎజెండా తయారీ లో ఆలస్యమైంది తప్ప ఉద్దేశ్యపూర్వకంగా జరిగింది కాదని సర్ది చెప్పడంతో చైర్‌పర్సన్ ఏమీ మాట్లాడలేదు. 20వ వార్డు గిరిజన గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ టీడీపీ కౌన్సిలర్ రామరాజు బ్యానర్‌తో కౌన్సిల్‌లోకి ప్రవేశించి నిరసన తెలియజేశారు. శివరాత్రి పేరుతో ఖర్చు చేసిన రూ.10 లక్షలకు సంబంధించి వివరణ ఇవ్వాలని జనసేన కౌన్సిలర్ సౌజన్య డిమాండ్ చేశారు. వాదనలు, ప్రతివాదనలతో సమావేశం ముగిసింది.

శారదాపీఠాధిపతులకు ఆహ్వానం



స్వరూపానందేంద్ర సరస్వతితో మాట్లాడుతున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై వచ్చే నెల 2న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం, 23న జరిగే చందనోత్సవాలకు హాజరు కావాలని శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలకు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆహ్వానించారు. శారదాపీఠంలో స్వరూపానందేంద్ర సరస్వతిని ఈవో బుధవారం కలిశారు. స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, చందనోత్సవానికి సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను ఈవో స్వామీజీకి వివరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం మెరుగైన ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలం కావడంతో భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని ఈవోకు స్వామీజీ సూచించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఈవో వెంట ఉన్నారు.

మూక్స్‌లో ఐపీఆర్ కోర్సు ప్రారంభం



కోర్సు ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే మూక్స్‌లో ఐపీఆర్ కోర్సును భాగం చేశారు. బుధవారం సాయంత్రం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి దీనిని ప్రారంభించారు. ఐపీఆర్ కోర్సుకు సంబంధించిన సిలబస్‌ను డీపీఐఐటీ ఐపీఆర్ చెయిర్ తీర్చిదిద్దింది. ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ ఐపీఆర్‌ని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కొన్ని యూజీ, పీజీ కోర్సుల్లో అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉంచిన మూక్ కోర్సును ఎవరైనా పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు ఆచార్య భాస్కరరెడ్డి, ఐపీఆర్ చెయిర్ గౌరవ సంచాలకులు ఆచార్య పురుషోత్తం, ఎలియన్స్ టాలెంట్ ఎడ్జ్ సంస్థ మేనేజర్ మహేష్ కుమార్ పాల్గొన్నారు.

టైంపాస్ చేయకండి

- పాఠశాలలపై పర్యవేక్షణ ఇలాగేనా?
- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- విశాఖలోని పలు పాఠశాలల తనిఖీ



ప్రకాశరావుపేట హైస్కూల్‌లో వర్క్‌బుక్‌లను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

విశాఖ విద్య: పాఠశాలల పర్యవేక్షణలో మీ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. టైంపాస్ చేస్తే అనుకున్న ఫలితాలు ఎలా వస్తాయి? నేనేమైనా టైంపాస్ కోసం జిల్లాల్లో పర్యటిస్తున్నానా? అంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా విద్యాశాఖాధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం నగరంలోని పలు పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. తొలుత ప్రకాశరావు పేట జీవీఎంసీ హైస్కూల్‌ను సందర్శించారు. ఓల్డ్ సిటీలోని స్కూళ్ల వివరాలు చెప్పాలని డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్‌ను అడిగారు. ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో.. మీ పరిధిలోని స్కూళ్ల గురించే తెలియకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంగ్లిష్ టీచర్‌ను ఇంటర్మీడియట్ పరీక్షల ఇన్విజిలేషన్ డ్యూటీ వేశారని చెప్పడంతో.. పరీక్షల సమయంలో ప్రాధాన్యం గల సబ్జెక్టు టీచర్లను ఇన్విజిలేషన్ డ్యూటీలకు పంపడం ఏంటని డీఈవోను ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ ఇన్విజిలేషన్‌కు వెళ్లిన ఉపాధ్యాయుల జాబితాను ఇవ్వాలని ఆర్జేడీ జ్యోతికుమారికి ఆదేశించారు. 4వ తరగతి గణితం సబ్జెక్టులో విద్యార్థుల నైపుణ్యతను పరిశీలించి, బోధన బాగుందని ఉపాధ్యాయురాలిని మెచ్చుకున్నారు. అనంతరం క్వీన్‌మేరీ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను తనిఖీ చేశారు. 8వ తరగతి డీ–సెక్షన్‌లో 22 మంది విద్యార్థినులు పాఠ్యపుస్తకాలను తీసుకురాకపోవడాన్ని గుర్తించారు.

పర్యవేక్షణ ఇలాగేనా..

రాష్ట్రంలోని మిగతా ఏ జిల్లాలో కూడా విశాఖ లాంటి అనువైన వాతావరణం లేదని, కానీ ఇక్కడ పర్యవేక్షణాధికారుల పనితీరు ఏమాత్రం బాగాలేదని ప్రిన్సిపల్ సెక్రటరీ అన్నారు. అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌కు ఎక్కడ ఏ స్కూల్ ఉందో, ఎవరు లీవ్‌లో ఉన్నారో కూడా తెలియదు అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. పోర్ట్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులకు ఒకరికి వర్క్ అడ్జస్ట్‌మెంట్, మరో ఇద్దరికి మెటర్నిటీ లీవ్ ఇచ్చినప్పుడు.. అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం లేదా అని అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సువర్ణపై అసహనం వ్యక్తం చేశారు. వారికి సంబంధించిన సమగ్ర నివేదికను తనకు అందజేయాలన్నారు. పాఠశాల పరిశీలన సమయంలో గుర్తించిన లోపాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పనితీరు మార్చుకోండి

టైంపాస్ మీటింగ్‌లు వద్దని, పనితీరు మెరుగుపరుచుకుని విద్యా కార్యక్రమాల అమలుపై దృష్టి పెట్టాలని ప్రవీణ్ ప్రకాష్ సూచించారు. ఎన్నిసార్లు చెప్పినా మారకపోతే ఎలా అన్నారు. గుర్తించిన లోపాలపై సంబంధిత ఉపాధ్యాయులు, పర్యవేక్షణాధికారులపై చర్యలు కఠినంగానే ఉంటాయన్నారు. పర్యటనలో ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, విశాఖ, అనకాపల్లి జిల్లాల డీవైఈవోలు రాయల సత్యనారాయణ, సుజాత, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, డీపీఈబీ సెక్రటరీ ఎం.వి.కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సామాజిక భవనానికి స్థల పరిశీలన



భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : గవరపాలెం రజక కాలనీ 80వ వార్డు పరిధిలో సామాజిక భవన నిర్మాణానికి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి బుధవారం స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అన్ని మౌలిక సదుపాయాలతో భవన నిర్మాణ పనులు త్వరితగతిన జరిగేలా పర్యవేక్షించాలని వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావుకు సూచించారు. కార్యక్రమంలో రజకసంఘాల నేతలు, మహిళలు పాల్గొన్నారు.

గౌరీ గ్రంథాలయ వార్షికోత్సవం రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక గౌరీ గ్రంథాలయ 80వ వార్షికోత్సవాన్ని ఈ నెల 31న నిర్వహించనున్నట్టు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా రడీమేడ్ లోకంలో టైలర్ల ప్రాధాన్యతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ వితరణ



వీల్ చైర్ అందుకున్న రమణమ్మతో సంఘ సభ్యులు

అనకాపల్లిటౌన్ : దివ్యాంగుల పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రుపల్లి వీరుయాదవ్ అన్నారు. సంఘ కార్యాలయంలో బుధవారం సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ సహకారంతో వృద్ధురాలు అడపా రమణమ్మకు వీల్‌చైర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల పట్ల పెద్ద మనసుతో పెన్షన్ పెంపు, తెల్లరేషన్‌కార్డు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. సంఘ గౌరవాధ్యక్షులు నాలం ఆశాకుమారి, కార్యదర్శి ఎం.చంద్రశేఖర్, కరణం శివ పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 3,821 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,210	4,310
మొదటి రకం	3,860	4,250
రెండో రకం	3,500	4,020
మూడో రకం	3,090	3,410

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 98 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-40 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-43 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 396 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

'రామో విగ్రహవాన్ ధర్మః'.. రాముడు వేసే ప్రతి అడుగూ, ప్రతి కదలికా.. సత్యం, ధర్మం కూడినవే. ధర్మ బద్ధ జీవనానికి నిలువెత్తు రూపం శ్రీరామచంద్రుడు. ఈ భూమిపై మనిషి ఎలా బ్రతకాలో.. జీవించి చెప్పిన పురుషోత్తముడాయన. అందుకే రాముడంటే కేవలం దేవుడు మాత్రమే కాదు.. భారతీయుల నరనరాన జీర్ణించుకున్న జీవన విధానం. శ్రీరాముడు త్రేతాయుగంలో జన్మించింది నవమినాడే. గురువారం శ్రీరామనవమి సందర్భంగా ఊరూవాడా రామనామ స్మరణతో మార్మోగనుంది. శ్రీరామ జననంతోపాటు, సీతారాముల కల్యాణం, శ్రీరామపట్టాభిషేక కార్యక్రమాలు అత్యంత వేడుకగా జరగనున్నాయి.

- ఊరూవాడా సీతారామ నామ స్మరణ
- అందంగా ముస్తాబైన రామాలయాలు

అనకాపల్లిటౌన్ : పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని రామాలయాలకు శ్రీరామనవమి శోభ సంతరించుకుంది. గురువారం సీతారాముల కల్యాణ వేడుకలకు ఆయా ఆలయాలు సకల ఏర్పాట్లతో ముస్తాబయ్యాయి. ఆలయాల ఉత్సవ కమిటీలు మామిడితోరణాలు, చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో ధగధగలాడుతున్నాయి. స్థానికంగా ఉన్న వేల్పులవీధి, కోట్నివీధి, మళ్లవీధి, చేపలబజారు, గాంధీనగరం, లక్ష్మీదేవిపేట, గవరపాలెం తదితర ప్రాంతాల్లోని రామాలయాల వద్ద కల్యాణ వేడుకలకు వేదికలు సిద్ధం చేశారు.



శ్రీరామనవమి సందర్భంగా రంగులతో తీర్చిదిద్దిన విగ్రహాలు



పెరుగుబజారు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు



పూడిమడక రహదారిలో విద్యుత్ అలంకరణలో శ్రీసీతారామాలయం

● పూడిమడక రహదారిలో ఉన్న రామాలయంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఊరేగింపు ముందు రామసాయి కోలాట బృందం గీతాలు పట్టణవాసులను అలరించాయి. అంతకుముందు మహిళలకు రంగవల్లుల పోటీలు జరిగాయి. గురువారం కల్యాణ వేడుకల్లో భాగంగా భారీ అన్నసమారాధన, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపుతో కల్యాణ వేడుకలు ముగియనున్నాయి.

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. సీతారాముల కల్యాణోత్సవంతోపాటు భారీ అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

● కశింకోటలోని గవరపేటలో ఉన్న శారదా గణపతి రామాలయంలో ఏటా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను సంప్రదాయంగా సారెతోపాటు గ్రామంలో ఊరేగించి కల్యాణం జరిపించే దంపతులను ఊరేగింపుగా తీసుకు వచ్చి కల్యాణం జరిపిస్తారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గానాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పుష్పాంజలి, పవలింపు సేవ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

● కస్పావీధి, పూసర్లవీధి, కనకమహాలక్ష్మి వీధిలోని రామాలయాలు, కోదండ సీతారామాలయంలో కూడా సీతారాముల కల్యాణోత్సవం, అన్న సమారాధనలకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

● తాళ్లపాలెం, బంగారయ్యపేట, కన్నూరుపాలెం, ఉగ్గినపాలెం, జి.భీమవరం, తీడ, అచ్చెర్ల, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, వెదురుపర్తి, సోమవరం, ఏఎస్ పేట, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, గొబ్బూరు, బంగారయ్యపేట, లాలంకొత్తూరు, చెరకాం, పరవాడపాలెం, జమాదులపాలెం, నరసింగబిల్లిలోని చెరకు కాటా వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయంలో కూడా సీతారాముల కల్యాణోత్సవాలు, అన్న సమారాధనలకు ఏర్పాట్లు చేశారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని అన్ని రామాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో పెళ్లి రాట మహోత్సవాలు నిర్వహించగా, బుధవారం కొండకర్ల, మళ్లవరం తదితర గ్రామాల్లో శ్రీసీతారాముల పెళ్లికి సంబంధించిన రాట మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



కొండకర్లలో సీతారాముల పెళ్లిరాట మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



నరసింగబిల్లి ఆంజనేయస్వామి ఆలయంలో నవమి వేడుకల ఏర్పాట్లు



కశింకోటలోని గవరపేటలో శారదాగణపతి రామాలయంలో సీతారాములు

బొజ్జన్నకొండ రహదారి పట్ల హర్షం

అనకాపల్లిటౌన్ : మండలంలో శంకరం గ్రామం నుంచి బొజ్జన్నకొండకు వెళ్లే బీటీరోడ్డు పనులు చేపట్టడం పట్ల సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రహదారి పనులు పూర్తయితే కొండకు వచ్చే సందర్శకుల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. రహదారితోపాటు వాకింగ్ ట్రాక్, రహదారికి ఇరువైపులా పూలమొక్కలు, పూర్తిస్థాయిలో లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేలా కృషి చేయాలని కోరారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళలకు కొండంత అండ



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు కొండంత అండ అని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని గోపాలపురం రామాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన మహిళా రిజర్వేషన్ అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. మహిళా సాధికారిత కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. అంతకుముందు 45 స్వయం సహాయక సంఘాల్లోని 514 మంది మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీలో భాగంగా రూ.40 లక్షల నగదును వారి ఖాతాల్లో జమ చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కె.నీలాచలం, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రుణ బకాయిల వన్‌టైం సెటిల్‌మెంట్‌కు తీర్మానం



సమావేశానికి హాజరైన మహిళా సభ్యులు



నరసింగబిల్లి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న గండి నాయుడుబాబు

కశింకోట : దీర్ఘకాలిక రుణ బకాయిల వసూలుకు వన్‌టైం సెటిల్‌మెంటు అమలు చేయాలని కోరుతూ నరసింగబిల్లి పీఏసీఎస్ సర్వ సభ్యసమావేశం తీర్మానించింది. సంఘ చైర్‌పర్సన్ గండి నాయుడుబాబు అధ్యక్షతన బుధవారం సాయంత్రం సంఘ ఆవరణలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2022-23 సంవత్సర జమా ఖర్చులు, వాస్తవ బడ్జెట్, అంచనా బడ్జెట్‌లను సమావేశం ఆమోదించింది. సంఘంలో నిరుపయోగమైన ట్రాక్టర్ రుణంపై అపరాధ వడ్డీ రద్దు చేయాలని కోరుతూ తీర్మానించింది. సమావేశానికి సాధారణంగా పురుష సభ్యులు హాజరవుతారు. బుధవారం సభకు మాత్రం చెరకాం, లాలంకొత్తూరు, చింతలపాలెం తదితర గ్రామాల నుంచి మహిళా సభ్యులు కూడా హాజరయ్యారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మలసాల కిషోర్, సంఘ మాజీ అధ్యక్షుడు మజ్జి ప్రసాదరావు, కార్యదర్శి నక్కా అచ్చియ్యనాయుడు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

కశింకోట : స్థానిక పూసర్ల వీధి నుంచి సచివాలయం వరకు, సంతబయలు నుంచి స్టేట్ బ్యాంకు వరకు మురికి కాలువల నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కేటాయించిన నిధులతో ఈ పనులు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు 5 వేల మీటర్ల మురికి కాలువలు నిర్మించామన్నారు.

క్షయ రోగులకు నిత్యావసరాల పంపిణీ



తాళ్లపాలెంలో క్షయ రోగులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆదినారాయణరెడ్డి

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీలో క్షయ రోగులకు బుధవారం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమతప్పకుండా మందులు, పోషకాహారం తీసుకుంటూ క్షయ రోగం నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కరపత్రాల పంపిణీ



బయ్యవరంలో ఆటో కార్మికులకు కరపత్రాలిస్తున్న సీఐటీయూ నాయకులు

కశింకోట : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న ఆందోళన కార్యక్రమానికి మద్దతు తెలపాల్సిందిగా చలో ఢిల్లీ కరపత్రాలను సీఐటీయూ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని బయ్యవరంలో ఆటో కార్మికులకు కరపత్రాలను అందించి, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో భాగంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో అధిక పోషకాలు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభావతి



తాళ్లపాలెంలో చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాల ప్రదర్శన

అనకాపల్లిటౌన్ : చిరుధాన్యాలతో అధిక పోషకాలు లభిస్తాయని సీడీపీవో ప్రభావతి అన్నారు. పోషణ్ పక్వాడాలో భాగంగా జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.సుహాసిని, డాక్టర్ ఖనీజజహారా, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు కె.అపర్ణ, వై.హర్షిణి, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు, తిమ్మరాజుపేట గ్రామాల్లో విజయ వాహిని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా బుధవారం చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. పోషక విలువలుండే చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఈ నిర్వాహకులు స్థానికులకు సూచించారు. బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లేమికి చిరుధాన్యాలతో చెక్ పెట్టవచ్చన్నారు.

చిరుధాన్యాల పోషక పదార్థాల ప్రదర్శన

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

అనకాపల్లిటౌన్ : స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన 10వ సాధారణ సమావేశంలో 2023-24 సంవత్సర వార్షిక బడ్జెట్‌ను కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద ఆమోదించారు. సోలార్‌రూఫ్ ప్యానల్ ఏర్పాటుపై తీర్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయానికి తీర్మానాలను త్వరలో పంపనున్నట్లు తెలిపారు. అంతకుముందు మార్కెట్ కొలగార్లు, కళాసీలకు రెండు జతల చొప్పున యూనిఫాం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, కమిటీ కార్యదర్శి డి.శకుంతల, ఉపాధ్యక్షులు కరక సోమునాయుడు, సభ్యులు నీటిపల్లి లక్ష్మి, మద్రిపల్లి శోభ తదితరులు పాల్గొన్నారు.



కళాసీలకు, కొలగార్లకు యూనిఫాం అందిస్తున్న పలకా యశోద

ప్రజలకు చేరువగా వైద్యం

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- సబ్బవరంలో 104 వాహనం ప్రారంభం

సబ్బవరం: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మానసపుత్రికగా చెప్పుకునే వైద్య రంగాన్ని మరో రెండు అడుగులు ముందుకు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువచేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం అందించిన 104 వాహనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కరోనాను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి మొదలు పెట్టిన ఆరోగ్యశ్రీ, 104లను గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయన్నారు. ప్రజలకు మరింతగా మెరుగ్గా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చామన్నారు. గతంలో సబ్బవరం మండలంలోని రెండు పీహెచ్‌సీలకు ఒకే ఒక 104 వాహనం ఉండగా ఇప్పుడు రెండో వాహనం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, యడ్ల నాయుడు, బంతికోళ్ల పద్మ, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

'ఆధార్ అప్‌డేట్ శిబిరాలను వినియోగించుకోండి'

మునగపాక : ఆధార్ కార్డు అప్‌డేట్ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని, తమ ఆధార్‌కార్డుల్ని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరరావు ఉన్నారు.



వాడ్రాపల్లిలో ఆధార్ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



అలరించిన పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

కశింకోట : స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో బుధవారం టెన్త్ విద్యార్థులకు జూనియర్లు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ ఏడాది స్కూలు విడిచి వెళ్లనున్న పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించి, బహుమతులు అందించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుకుంటూ ఫేర్‌వెల్ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ పి.శైలజ, ఉపాధ్యాయ సిబ్బంది, అన్ని తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్బీకేలను సందర్శించిన ఏడీఏ



నష్టపోయిన నువ్వు పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రవి ప్రకాష్, వ్యవసాయ సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి) : కిసాన్ ఈ కేవైసీని త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతు భరోసా కేంద్రా (ఆర్బీకే)ల్లోని వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని యలమంచిలి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.రవిప్రకాష్ సూచించారు. బుధవారం ఆయన అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి, హరిపాలెం, జగ్గన్నపేట రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు జగ్గన్నపేట, ఖాజీపాలెం పరిసరాలోల దెబ్బతిన్న నువ్వు పంటలను ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులు, ఆయా పంటల వివరాలను నమోదు చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. ఏవో శంకర్ గోవింద్, విస్తరణాధికారి సూర్యనారాయణ, ఏఈవో దేవుడు, సర్పంచ్ దొడ్డి కృష్ణ వెంకటలక్ష్మి, రైతులు మళ్ల భాస్కరరావు, దొడ్డి దుర్గినాయుడు, మళ్ల ఆదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళను గాయపర్చిన వ్యక్తిపై కేసు

అనకాపల్లిటౌన్ : వివాహితను కర్రతో కొట్టిన వ్యక్తిపై రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు కథనం మేరకు వివరాలు.. మండలంలోని కొండుపాలేనికి చెందిన సేనాపతి సత్యవతి పొలంలో అదే గ్రామానికి చెందిన సేనాపతి సూరిబాబుకు చెందిన పశువులు మేస్తున్నాయి. విషయం తెలుసుకున్న సత్యవతి పశువుల్ని తన పొలంలో ఎందుకు మేపుతున్నావని సూరిబాబును అడిగింది. దీంతో సూరిబాబు ఆగ్రహించి తన చేతిలో ఉన్న కర్రతో సత్యవతి తలపై కొట్టాడు. దీంతో గాయపడ్డ సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.